## భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఎదులాపూరం, మే 22 : భార్యను మానసికంగా, శారీరకంగా హింసించి ఆత్మహత్యకు కారణమైన భర్తకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి తీర్పును వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి ఏ.వెంకటమ్మ తెలిపారు. జైనథ్ మండలంలోని బోరజ్‌సమీపంలో గల జీఎంఆర్ స్పిన్నింగ్ మిల్ క్వాటర్స్ వద్ద నిందితుడు సిడాం హిమంత్ రావు, భార్య రోజాతో జీవనం సాగిస్తూ ఉండేవారు. పెళ్లయిన కొన్ని నెలల నుంచి ప్రతిరోజూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ క్రమంలోనే 23జూన్ 2019న రోజా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రోజా తండ్రి మడవి ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిమంత్‌రావుపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారణ జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ సహకారంతో గురువారం 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ షైనీ సుల్తానా నేరం రుజువు చేయగా, గౌరవ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కోర్టు లైసెన్ అధికారి ఏఎస్ఐ శ్రీమతి ఏ వెంకటమ్మ తెలిపారు. కోర్టులో నిందితుడికి శిక్ష పడడంలో ముఖ్యపాత్ర పోషించిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


మేకల నర్సయ్య (ఫైల్)

దిలావర్‌పూర్ మే 22 : చేపల వేటకు వెళ్లి చెరువులో పడి మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన మేకల నర్సయ్య (35) గురువారం మృతి చెందినట్లు దిలావర్‌పూర్ ఏఎస్ఐ భీంరావు తెలిపారు. నర్సయ్య సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో వెతికారు. చెరువులో పడి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి


బోయర్ దామోదర్(ఫైల్)

జైనథ్, మే 22 : జైనథ్ మండలానికి చెందిన బోయర్ దామోదర్(50) కౌలు రైతు గురువారం పొలంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు జైనథ్ ఎస్ఐ గౌతం తెలిపారు. దామోదర్ పొలంలో జూక్ వైర్ బిగించుకున్నాడు. గాలి దుమారంతో జూక్ వైర్‌పై కరెంట్ తీగ తెగి పడడంతో పనుల కోసం పొలానికి వెళ్లడంతో కరెంట్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బోయర్ సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య సవితతోపాటు ముగ్గురు కూతుళ్లున్నారు.

## విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

బాసర, మే 22 : బాసరలో గురువారం రెండు గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. బొర్ర గణేశ్ కాలనీకి చెందిన లాటీ దేవిదాస్ అనే గొర్రెల కాపరి గొర్రెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రెండు గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ. 27వేలు ఉంటుందని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరాడు.

## కారు దగ్ధం

ఖానాపూర్ టౌన్, మే 22 : పార్కింగ్ చేసి ఉన్న కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ప్రమాదం తప్పింది. గురువారం జగిత్యాల జిల్లాకు చెందిన గుర్రం మహేశ్ ఖానాపూర్ పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చి ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో తన కారును పార్కింగ్ చేశాడు. కొద్ది సేపటికి కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో జావేద్ అలీ, సిబ్బంది ఖాదీర్ ఖాన్, హుస్సేన్, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

## అంగన్‌వాడీలో చోరీ

ఇచ్చోడ, మే 22 : మండలంలోని గేర్జం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి లోపల ఉన్న 50 కిలో కందిపప్పు, వంటనూనె ప్యాకెట్లు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారని అంగన్‌వాడీ టీచర్ పుష్పలత తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విమల తెలిపారు.

## నర్సరీ పరిశీలన

ఇంద్రవెల్లి, మే 22: మండలంలోని పిట్ట బొంగారం, హర్కాపూర్‌లోని నర్సరీని గురువారం ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పరిశీలించారు. కలెక్టర్, డీఆర్‌డీవో ఆదేశాల మేరకు ఇప్ప చెట్లు నాటేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రైతు కుటుంబాలకు అండగా నిలబడుదాం

- మాజీ మంత్రి జోగు రామన్న


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 22: కాంగ్రెస్ పాలనలో రైతాంగం పూర్తిగా సంక్షోభానికి గురవుతుందని రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్న పరిస్థితుల్లో రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ కార్యకర్తలు అండగా నిలబడుతూ వారికి ధైర్యాన్ని కల్పించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పిలుపునిచ్చారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో నిర్మల్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యకర్తలతో చర్చించి కొన్ని విషయాలను వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ...బీజేపీ కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. కాంగ్రెస్ పాలన కంటే కేసీఆర్ పాలన బాగుండేనని ప్రజలు మరోసారి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని అన్నా. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం కచ్చితంగా ఏర్పడుతుందని రైతు కుటుంబాలు వారి ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి రమాదేవి. విలాస్, శ్యామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల కోసం సర్వే

ఎదులాపురం, మే 22: బడి బయట ఉన్న పిల్లల కోసం సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జిన్నింగ్ ఫ్యాక్టరీలు, కంకర క్రషర్, దాబాల్లో గురువారం సంబంధిత శాఖ సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో బడీడు పిల్లలు ఉంటే వారికోసం ప్రత్యేకంగా వర్క్ సైడ్ స్కూల్ (పనిచేసే ప్రదేశంలో పాఠశాల)ను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ సర్వేలో ఎల్‌సీపీవో రమేశ్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కే వినోద్, డీసీపీయూ సిబ్బంది పద్మ, ప్రేమేందర్, కార్మిక శాఖ సిబ్బంది సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, మే 22: ఆదిలాబాద్ లోని ఇటీవల టేలాలు తొలగించడంతో ఇబ్బంది పడుతున్న వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని ఎంఐఎం పార్టీ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో వీధి వ్యాపారులతో కలిసి ఓవైసీ విన్నవించగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## ఇంటింటా సర్వే పారితోషికం అందించాలి

బజార్‌హత్నూర్ మే 22 : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు, పారితోషికం అందించాలని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు మండల ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, ఆత్మారాం, రాజ్‌కుమార్, అభిలాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పందుల బెడదను నివారించాలని వినతి

ఉట్నూర్, మే 22 : ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో పందులు స్వైర విహారాన్ని నివారించాలని ఐటీడీఏ పీవోకు కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు. గురువారం పీవో క్యాంప్ కార్యాలయంలో శాంతినగర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ పట్టణంలోని సేవాదాస్‌నగర్‌లోని సేవాలాల్ గుడి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పందులు స్వైర విహారం చూస్తూ ప్రజలపైకి దాడికి పాల్పడుతున్నాయని తెలిపారు. అధికారులు పట్టించుకొని పందుల బెడద నివారించాలని కోరారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఎదులాపురం, మే 22: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 1823 మందికి కాగాను 1716 హాజరై 107 గైర్హాజరైనట్లు డీఈవో గణేశ్ జాదవ్ తెలిపారు. విద్యార్థుల కోసం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, వసతులు కల్పించి, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 12 నెలల పెండింగ్ వేతనం ఇవ్వాలి

ఉట్నూర్, మే 22 : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమాలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న డెలీవైజ్ వర్కర్లకు 12 నెలల వేతనం చెల్లించాలని ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్టేట్ తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ సీటీడబ్ల్యూ దిలీప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, యాకుబ్, రాజలింగు ఉన్నారు.

## చందాలు వేసి..పైపులైన్‌కు మరమ్మతు


నాగల్‌కొండలో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు చేపట్టిన గ్రామస్తులు

నార్నూర్, మే22: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం నాగల్‌కొండ పంచాయతీ పరిధిలోని మైనార్టీ వార్డులో పదిరోజుల నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని మైనార్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గం లేక అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఇంటికి రూ.100చొప్పున చందాలు వేసుకొని రూ.5వేలతో పైపులైన్‌కు మరమ్మతు చేశారు. అయినా నీటి సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నార్నూర్, మే22: తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మండలంలోని నగల్‌కొండ పంచాయతీ పరిధిలోని మైనార్టీ వార్డు వాసులు ఎంపీడీవో గంగసింగ్‌కు వినతిపత్రాన్ని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.


దిలావర్‌పూర్ : నీళ్లలో నుంచి వడ్లను తీస్తున్న రైతులు


ఉట్నూర్ రూరల్ : మొలకెత్తిన వడ్లు


నర్సాపూర్ (జీ) : రాంపూర్‌లో నీటిని తొలగిస్తున్న రైతు

# వడ్లల్లో మొలకలు..రైతుకు కన్నీళ్లు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- పలు చోట్ల మొలకలు రావడంతో అన్నదాతల ఆందోళన
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వేడుకోలు

ఉట్నూర్ రూరల్, మే 22: ఉట్నూర్ మండల వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో గంగన్నపేట్‌లోని వరి కొనుగోళ్ల కేంద్రంలోని వడ్లు తడిశాయి. ఈదురు గాలులకు ధాన్యం కుప్పలపై ఉంచిన టార్పలిన్‌లు కొట్టుకుపోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చేతికి వచ్చిన పంట తడిసిపోయి మొలకలు రావడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. కొనుగోళు కేంద్రంలో సుమారు 500 క్వింటాళ్ల వడ్లున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తూకం వేసి మిల్లుకు తరలించాలని కోరారు.

**కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి**

మండలంలోని కొనుగోళ్ల కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఐకేపీ డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని గంగన్నపేటలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఇంద్రవెల్లిలో..**

ఇంద్రవెల్లి, మే 22: ఇంద్రవెల్లి మండలంలో గురువారం కురిసిన వర్షంతో రైతులు ఇబ్బంది పడ్డారు. జొన్నలు, మక్కలు ఇతర పంటలు విక్రయాలు నిలిచిపోయాయి. మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

**ఆకాల వర్షం ..అపార నష్టం**

దిలావర్‌పూర్ మే 22 : మండలకేంద్రమైన దిలావర్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకపోయాయి. 20 రోజుల క్రితం ఆరబోసిన ధాన్యానికి గోనే సంచులు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**నర్సాపూర్ (జీ), మే, 22 :** మండలంలోని రాంపూర్ గ్రామంలో అకాల వర్షాలతో వరి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తడిసిన ధాన్యం కొనాలని కోరుతున్నారు.

**అకాల వర్షంతో ఆగం**

కుంటాల, మే, 22 : మండలంలో వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడుస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కుంటాలకు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి కూడా రైతులు తమ సమస్యను వివరించారు.


దస్తురాబాద్ : మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

**రైతు కష్టం వర్షార్పణం**

దస్తురాబాద్, మే22 : వర్షానికి మండల రైతులు తీవ్రంగా నష్ట పోయారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తరలించడంలో జాప్యంతో ధాన్యం తడిసి మొలకెత్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. టార్పాలిన్ కవర్లు కప్పుతూ తిప్పలు పడుతున్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తే తమకు కష్టాలు ఉండేవి కావని వాపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

**మళ్లీ వర్షం..తడిసిన ధాన్యం**

సోన్, మే 22 : సోన్ మండల కేంద్రంతో పాటు పాక్‌పట్ల, సిద్దులకుంట, న్యూవెల్మల్ బొప్పారం, కూచన్‌పెల్లి, కడ్తాల్, గంజాల్, సాకెర, నిర్మల్ మండలంలోని ముఠాపూర్, అక్కాపూర్, ఎల్లపెల్లి, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. టార్పాలిన్‌లు లేక, కొనుగోళ్లలో జాప్యంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

**తేమశాతం లేకుండా కొనాలి**

సోన్, మే 22 : తడిసిన ధాన్యాన్ని తేమశాతం లేకుండా కొనాలని జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు అన్నారు. గురువారం నిర్మల్ మండలంలోని మంజులాపూర్, చిట్యాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, సోన్ మాజీ జడ్పీటీసీ సభ్యులు జీవన్‌రెడ్డి, నాయకులు విఠల్ ప్రశాంత్, చిన్నయ్య, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

**వర్షంతో రైతులు ఆందోళన చెందవద్దు**

ముథోల్, మే, 22 : ధాన్యం తడిసిన ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని తహసీల్దార్ శ్రీలత అన్నారు. ముథోల్ మండలంలోని చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, వరి కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ పరిశీలించారు. వెంటవెంటనే ధాన్యాన్ని తూకం వేసి లారీలో వెంటనే రైస్ మిల్లుకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్ఐ నారాయణ రావు, నిర్వాహకులున్నారు.

**ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది**

దస్తురాబాద్,మే 22 : అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యాపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని దస్తురాబాద్, రేవోజీపేట, బుట్టాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

**కొనుగోళ్లలో జాప్యంపై రైతుల నిరసన**

పెంబి, మే 22: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలో వరిధాన్యం కోనుగోలులో జాప్యం చేస్తున్నారని రైతులు ధాన్యం కోనుగోలు కేంద్రం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. 20 రోజుల క్రితం పుల్గంపాండ్రి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఒక్క గింజ కూడా కొనలేదని రైతులు వాపోయారు. అధికారులకు విన్నవిస్తే హమాలీల కొరతతో జాప్యం జరుగుతుందని చెబుతున్నారని, గన్నీ బ్యాగులు కూడా ఇవ్వడంలేదని రైతులు వాపోయారు.


ఉట్నూర్ రూరల్ : తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతులు


కుంటాల : ధాన్యంపై టార్పాలిన్ కవర్ కప్పుతున్న రైతులు


పెంబి : పుల్గంపాండ్రిలో కొనుగోలు కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు


మంజులాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జొన్నల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి


తాంసి : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి


బోథ్ : పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి

తాంసి, మే 22 : మార్కెట్ యార్డులో జొన్న రైతులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులకు సూచించారు. గురువారం తాంసి సబ్ మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలతో జొన్నలు తడిసి ముద్దవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యార్డులో వసతులు కల్పించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని కోరారు. ఆమెతో పాటు నాయబ్ తహసీల్దార్ గణేశ్ జాదవ్, సీఈవో కేశవ్, మండల రైతులు ఉన్నారు.

**జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయాలి**

బోథ్, మే 22 : వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయాలని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి సూచించారు. గురువారం బోథ్ మార్కెట్ యార్డ్‌లో జొన్న కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఈనెల చివరి వరకు కొనుగోలు ఉంటాయన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన పడొద్దన్నారు. మార్క్‌ఫెడ్, సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. ఆయన వెంట సొసైటీ సిబ్బంది, నాయకులు, రైతులు ఉన్నారు.

**కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఏవో**

నార్నూర్, మే 22: నార్నూర్ మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య గురువారం పరిశీలించారు. రికార్డులు పరిశీలిస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన పంటను కొనుగోలు చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ఆడే గణేశ్‌కు సూచించారు. ఈ నెలలోపు జొన్నల కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఆకాశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉత్తమ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

**వర్షంతో జొన్న రైతుల అవస్థలు**

బోథ్, మే 22 : మండలంలో బుధవారం రాత్రితోపాటు గురువారం కురిసిన వర్షంతో బోథ్ మార్కెట్ యార్డుతోపాటు ధన్నూర్(బీ) కొనుగోలు కేంద్రాలోని జొన్నలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. టార్పాలిన్‌లు, పారీలు కుప్పలపై కప్పుతూ తిప్పలు పడ్డారు. జొన్న, నువ్వులు కోతలు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

**భీంపూర్‌లో..**

భీంపూర్, మే 22: భీంపూర్ మండలంలో గురువారం ఒక మోస్తరుగా వర్షం కురిసింది. తాంసి మార్కెట్ యార్డుకు జొన్నలు విక్రయించేందుకు వెళ్లిన రైతులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. గుబిడి, కరంజి(టీ) సహా అంతటా వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. ఆదిలాబాద్ - కరంజి(టీ) అధ్వాన్న రోడ్డుపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**నార్నూర్‌లో..**

నార్నూర్, మే 22 : ఉమ్మడి మండలంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. నార్నూర్ ఉప మార్కెట్ యార్డులో జొన్నలను విక్రయించేందుకు వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. చేతికి వచ్చిన జొన్న పంట వర్షానికి తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**మార్కెట్ యార్డులో రైతులకు తప్పని తిప్పలు.**

తాంసి, మే 22 : మండలకేంద్రంతోపాటు పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, గిరిగామ, అంబుగాం, ఈదుల్లా సవర్గాం, బండల్ నాగపూర్‌లో వర్షం కురిసింది. తాంసి మార్కెట్ యార్డులో సరైన వసతులు లేకపోవడంతో జొన్న రైతులు ఇబ్బందులు పడ్డారు. వెంటనే మార్కెట్ యార్డులో సీసీ రోడ్డుతో పాటు షెడ్డు నిర్మాణాన్ని సరైన వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

# రానున్న మూడు రోజులపాటు వర్షాలు

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ఎదులాపురం, మే 22 : రానున్న మూడు రోజుల పాటు అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లు, అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావ్ ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో అకాల వర్షాలు, వరి ధాన్యం కొనుగోలు, ఖరీఫ్ సీజన్ సన్నద్ధం అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2, 3 రోజులు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి కలెక్టర్ రాజర్షి షా, జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామి వివరించారు.

**వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి**

తెలంగాణలో అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని, రైతుల రక్షణ, ట్రాఫిక్, డ్రైనేజీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కోంకణ్ గోవా తీర ప్రాంత సమీపంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం ఉత్తర దిశగా కదులుతూ, రాగల 36 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వివరించింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం, శనివారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించిందన్నారు.

## పింఛన్ ఇప్పించరూ..


డీఆర్‌డీవో విజయలక్ష్మిని విన్నవిస్తున్న దివ్యాంగుడు వరాల గోవర్ధన్

కుంటాల, మే, 22 : కుంటాల మండల కేంద్రానికి చెందిన వరాల గోవర్ధన్ అనే వ్యక్తి 89 శాతం వైకల్యంతో పెన్షన్ పొందడానికి అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో అందడం లేదు. గతంలో హైదరాబాద్‌లో సీఎం పేషీలో పెన్షన్ కోసం అర్జీ ఇవ్వగా డీఆర్‌డీఏ అధికారులు విచారణ జరిపి వివరాలు సేకరించినా బాధితునికి ఇంకా సాయం అందలేదు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి కుంటాలకు డీఆర్డీవో విజయలక్ష్మికి విన్నవించాడు. ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం కాగానే దరఖాస్తు ప్రాసెస్ చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## బాలశక్తిని పకడ్బందీగా అమలు చేయాలి

నిర్మల్ అర్బన్, మే 22 : పాఠశాలల్లో బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బాల శక్తి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సౌమ్య అన్నారు.గురువారం నిర్మల్ పట్టణంలోని వివిద పాఠశాల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో బాలశక్తి పథకంపై వివరించారు. జిల్లాలో 57 సంక్షేమ పాఠశాలల్లో గతేడాది నుంచి కొనసాగిస్తున్నామని ఈ సంవత్సరం 118 పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నామని తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధించాలి

లక్ష్మణచాంద, మే 22 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధించాలని డీఈవో పీ రామారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్‌వర్మ, రీసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులున్నారు.

## ఆర్డీవోకు, ఏఎస్పీకి వినతి

భైంసా, మే, 22 : గో సేవా, గో సంరక్షణ విభాగ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కోమల్ రెడ్డికి, ఏఎస్పీ అవినాష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గోవులను వధించకుండా చూడాలని, అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కుంటాల, మే, 22 : కూలీల మస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని, పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం కుంటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. 5 కోట్ల 30 లక్షలతో చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పనిచేయకున్నా డబ్బు చెల్లించడం, కూలీలకు సౌకర్యాలు కల్పించకపోవడం, నాటిన మొక్కలను సంరక్షించకపోవడం మొదలగు విషయాలు ఆడిట్‌లో బహిర్గతమయ్యాయి. ఈ సమావేశంలో విజిలెన్స్ అధికారి లక్ష్మణ్, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, అంబుడ్స్‌మన్ నవీన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, పీఆర్ఏఈ గౌరీశ్, డీఆర్పీలు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇనాం భూముల వేలం

తానూర్, మే 22 : ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను వేలం పాటను గురువారం తహసీల్ కార్యాలయంలో గురువారం ఇనాం భూములను వేలం నిర్వహించినట్లు తహసీల్దార్ లింగమూర్తి తెలిపారు. పలువురు వేలం పాడి భూములను దక్కించుకున్నారని, సంవత్సరం పాటు ఈ భూములు వారి ఆధీనంలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌సింగ్, నరేశ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## బోధనలో మార్పు అవసరం : ఆర్జేడీ


మాట్లాడుతున్న ఆర్జేడీ సత్య నారాయణ రెడ్డి


దస్తురాబాద్,మే22 : ప్రస్తుత కాలానికి అనుగుణంగా బోధనలో మార్పులు చేసుకోవాలని విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ కె.సత్య నారాయణ రెడ్డి అన్నారు.మండలంలోని మున్యాలలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కార్యకార్యక్రమాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో టీ.గంగాధర్, కాంప్లెక్స్ ప్రధాన కార్యదర్శి కోట వేణు, డీఆర్పీలు, కోర్స్ ఇన్‌చార్జిలు, సీఆర్పీ తిరుపతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

ఖానాపూర్ టౌన్, మే 22: ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు భాగ్యరెడ్డి వర్మ

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఎదులాపురం, మే 22 : వందేండ్ల క్రితమే దళిత బిడ్డల కోసం హైదరాబాద్ లో 26 పాఠశాలలను నెలకొల్పిన ఆదర్శనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా కొనియడారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఎం. మనోహర్, డీబీసీడీవో రాజలింగు, ఏఎస్‌డబ్ల్యూవో నారాయణ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ కలెక్టరేట్‌లో**

నిర్మల్ అర్బన్, మే 22 : భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. నిర్మల్ కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అభివృద్ధిశాఖల అదికారులు రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్, శంకర్, మోహన్ సింగ్, నరసింహ రెడ్డి, తదితరులున్నారు.

**ఎస్పీ కార్యాలయంలో..**నిర్మల్ పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి ఎస్పీ జానకీ షర్మిల పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఓ యూనిస్ అలీ, సీఐలు ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.